ఆకాశవాణి హైదరాబాద్ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

ప్రాంతీయ వార్తలు

తేది: 13.04.2026 సమయం: 13.10 గంటలు

ముఖ్యాంశాలు

1. భారత్ ను గ్లోబల్ మైనింగ్ లీడర్ గా తీర్చి దిద్దడమే లక్ష్యమని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి. కిషన్ రెడ్డి తెలిపారు. హైదరాబాద్ HICC లో నిర్వహిస్తున్న 2 వ విడత ఎక్స్ ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7 వ విడత క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమాన్ని మంత్రి ఈరోజు లాంఛనంగా ప్రారంభించారు.

2. కాళేశ్వరం బ్యారేజీలను 2028 నాటికి వినియోగంలోకి తెస్తామని నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు.

3. తెలంగాణ పోలీసులు అరైవ్ అలైవ్ కార్యక్రమాలను రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నారు. వాహనదారులు రోడ్డు భద్రత నియమాలను పాటించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పిలుపునిచ్చారు.

4. రాష్ట్ర వ్యాప్తంగా ఎండల తీవ్రత పెరుగుతోంది. నాలుగు రోజుల పాటు అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతాయని వాతావరణ కేంద్రం హెచ్చరించింది.

**కిషన్ రెడ్డి - క్రిటికల్ మినరల్స్ రోడ్ షో**

ఆత్మ నిర్భర్ భారత్ కలను సాకారం చేయడంలో క్రిటికల్ మినరల్స్ ముఖ్య భూమిక పోషిస్తాయని కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి జి కిషన్ రెడ్డి చెప్పారు. ప్రస్తుత కాలంలో జియో పాలిటిక్స్, వాతావరణ మార్పులు, ఆర్థిక భద్రత రంగాల్లో క్రిటికల్ మినరల్స్ కేంద్ర బిందువుగా మారాయిని ఆయన అన్నారు. హైదరాబాద్ HICC లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో 2 వ విడత ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ వేలం, 7 వ విడత క్రిటికల్ అండ్ స్ట్రాటజిక్ మినరల్ బ్లాక్స్ వేలం కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కిషన్ రెడ్డి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... ప్రతి దేశం భవిష్యత్తుకు క్రిటికల్ మినరల్స్ ఆధారంగా మారాయని పేర్కొన్నారు.

**sound byte-kishan reddy**

ఇప్పటివరకు 6 విడతల్లో 46 క్రిటికల్ మినరల్స్ బ్లాకుల వేలం ప్రక్రియ.. విజయవంతంగా పూర్తయిందనీ, ఇప్పుడు 7 వ విడతలో భాగంగా 19 బ్లాక్స్ కు వేలం ప్రక్రియ ప్రారంభించుకున్నట్లు కిషన్ రెడ్డి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం తొలిసారిగా మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ మొదటి విడత ప్రారంభించిందని, త్వరలోనే 11 బ్లాకులకు రెండో విడత మినరల్ ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్ కూడా ప్రారంభించడానికి చర్యలు చేపట్టనట్లు వివరించారు. మైనింగ్ సులభంగా చేసుకోవడానికి, అటవీ, పర్యావరణ అనుమతుల ప్రక్రియను, చట్టాలను ప్రభుత్వం సులభతరం చేసిందని తెలిపారు. తెలంగాణలో రెండు వెనేడియం, టైటానియం బ్లాకులు వేలానికి సిద్ధంగా ఉన్నాయిని కిషన్ రెడ్డి చెప్పారు. భారత దేశంలోనే

కాకుండా ఆస్ట్రేలియా, అర్జెంటీనా వంటి దేశాల్లో కూడా మినరల్స్ వెలికి తీసేందుకు కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని మంత్రి తెలిపారు.భారత్‌ను ఖనిజ రంగంలో గ్లోబల్ లీడర్‌గా నిలబెట్టేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి G. వివేక్ వెంకట స్వామి, బొగ్గు గనుల మంత్రిత్వ శాఖ కార్యదర్శి పీయూష్ గోయల్, జాయింట్ సెక్రటరీ F.M.Nayak, పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

MSM/ RNU/HYD

**కాళేశ్వరం బ్యారేజీల పునరుద్ధరణ**

2028 నాటిని కాళేశ్వరం బ్యారేజీలను తిరిగి వినియోగంలోకి తేవాలని నిర్ణయించినట్లు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలోని మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల పునరుద్ధరణ పనులను వెంటనే చేపట్టాలని అధికారులను మంత్రి ఆదేశించారు. బ్యారేజీల పునరుద్ధరణ పనులపై అధికారులతో నిన్న సమావేశం నిర్వహించిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి... పనులు వేగంగా పూర్తి చేసేందుకు నీటి పారుదల రంగ నిపుణుడు కల్నల్ పరీక్షిత్ మెహ్రా కన్వీనర్ గా ఉన్నత స్థాయి స్టీరింగ్ కమిటీని వెంటనే ఏర్పాటు చేయాలని సూచించారు.

డెస్క్

**శ్రీపాదరావుకు నివాళి**

దివంగత స్పీకర్ దుద్దిళ్ల శ్రీపాదరావు 27వ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ నివాళులు

అర్పించారు. ధన్వాడ గ్రామంలో జన్మించిన శ్రీపాదరావు సర్పంచ్ స్థాయి నుంచి ఎదిగి ఎమ్మెల్యే అయ్యాక ప్రజలకు విశేష సేవలందించారని కొనియాడారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్‌గా పనిచేసి ఆ పదవికి గౌరవం తీసుకువచ్చిన గొప్ప నాయకుడుగా చరిత్రలో నిలిచిపోయారని మంత్రి లక్ష్మణ్ కుమార్ అన్నారు. తండ్రి వారసత్వాన్ని కొనసాగిస్తూ మంత్రి శ్రీధర్ బాబు రాజకీయాల్లో రాణిస్తున్నారని తెలిపారు.

PTC – జగిత్యాల

**అన్నా బాహు సాఠే విగ్రహావిష్కరణ**

దేశంలో దళిత సాహిత్యానికి దిశా నిర్దేశం చేసిన మహానుభావుడు అన్నా బాహు సాఠే అని సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. నిజామాబాద్...చంద్రశేఖర్ కాలనీ చౌరస్తాలో నూతనంగా నెలకొల్పిన అన్నా బాహు సాఠే విగ్రహాన్ని నిన్న సాయంత్రం టీపీసీసీ చీఫ్, ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్‌తో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పేదలు, అణగారిన వర్గాల జీవన వాస్తవాలను తన రచనల ద్వారా ప్రతిబింబించిన గొప్ప రచయిత అన్నా బహు సాఠే అని కొనియాడారు. సామాజిక అసమానతలు, అన్యాయాలపై తన కలం ద్వారా పోరాడిన ప్రజాకవి అని.. సమానత్వం, న్యాయం, మానవ హక్కుల కోసం జీవితాంతం కృషి చేశారని గుర్తు చేశారు.

PTC - నిజామాబాద్

**విద్యుత్ ఉద్యోగులతో భట్టి**

విద్యుత్ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి సీనియర్ అధికారులతో కమిటీ వేస్తామని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలిపారు. నిన్న ప్రజాభవన్ కు వెళ్లిన విద్యుత్ ఉద్యోగుల జేఏసీ నాయకులు... డిస్కంలను ప్రైవేట్ పరం చేస్తారని ప్రచారం జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా.. విద్యుత్ డిస్కంలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రైవేటీకరించేది లేదని భట్టి విక్రమార్క స్పష్టం చేశారు. విద్యుత్ సంస్థలను బలోపేతం చేసుకోవాల్సిన అవసరం ఉద్యోగులు, జేఏసీ నేతలు, అధికారులు అందరిపైనా ఉందన్నారు. ఉద్యోగుల సమస్యలను విని వాటిని పరిష్కరించేందుకు ఉద్యోగ సంఘాలకు ప్రతి నెల ఒక గంట పాటు సమయం ఇచ్చేలా విద్యుత్ సంస్థల ఉన్నతాధికారులను ఆదేశిస్తామని తెలిపారు.

డెస్క్

**సీబీజీ ప్రాజెక్ట్ ..శ్రీధర్ బాబు**

క్లీన్ ఎనర్జీలో తెలంగాణను రోల్ మోడల్ రాష్ట్రంగా నిలిపేలా ప్రత్యేక కార్యాచరణతో ముందుకు వెళ్తున్నామని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు అన్నారు. సర్క్యులర్ ఎకానమీని ప్రోత్సహించడం ద్వారా అటు పారిశ్రామిక వృద్ధిని, ఇటు పర్యావరణ పరిరక్షణను సమన్వయం చేయాలన్నదే తమ లక్ష్యమని వివరించారు. సిద్దిపేట జిల్లా నుంగనూరు మండలం నర్మెట్టలో... కంప్రెస్డ్ బయో గ్యాస్ ప్రాజెక్టుకు నిన్న భూమి పూజ జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా మంత్రి శ్రీధర్ బాబు పాల్గొన్నారు. జునో జౌల్ బయో ఫ్యూయల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో 700 కోట్ల రూపాయల పెట్టుబడితో సీబీజీ ప్రాజెక్టును నెలకొల్పుతోంది. వరి గడ్డి, ఆవు పేడ, కోళ్ల వ్యర్థాలతో బయో ఫ్యూయల్ గ్యాస్ ఉత్పత్తిని చేయనుంది. ప్రస్తుత పరిస్థితుల్లో ఇంధన అవసరాల కోసం ఇతర దేశాలపై

ఆధారపడటాన్ని తగ్గించుకోవాలంటే "క్లీన్ ఎనర్జీ"నే కీలకమని మంత్రి శ్రీధర్ బాబు అభిప్రాయపడ్డారు.

డెస్క్

**సిరిసిల్ల జిల్లాలో అరైవ్ అలైవ్**

రోడ్డు భద్రత నియమాలను ప్రతి ఒక్కరూ పాటించాలని ప్రభుత్వ విప్, వేములవాడ శాసనసభ్యులు ఆది శ్రీవివాస్...వాహనదారులకు సూచించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా నిజామాబాద్ గ్రామంలో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో అరైవ్ అలైవ్ రోడ్డు భద్రత వారోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ....వాహనదారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఆ తర్వాత రోడ్లపై ఉన్న గుంతలను పూడ్చి వేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ...

**SOUND BYTE - AADI SRINIVAS**

బైక్ నడిపేవారు హెల్మెట్లు పెట్టుకోవాలని, కారులో ప్రయాణించేవారు సీటు బెల్ట్ పెట్టుకోవాలని పోలీసు అధికారులు సూచించారు.

PTC - సిరిసిల్ల

**డీజీపీ పర్యటన**

ఆసిఫాబాద్ జిల్లాలో డీజీపీ శివధర్ రెడ్డి పర్యటన రాత్రి వరకు కొనసాగింది. అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా వెయ్యి మంది ఆదివాసీలకు హెల్మెట్లు పంపిణీ చేశారు. పోలీసులు మీకోసం కార్యక్రమంలో భాగంగా మహిళలకు కుట్టు మిషన్లు పంపిణీ చేశారు. అంతకుముందు ఆదివాసి సాంప్రదాయాలతో డీజీపీకి గుస్సాడీ, దింసా ఇతర నృత్యాలతో ఘన స్వాగతం లభించింది. ఆదివాసీల సంక్షేమం కోసం

పోలీసులు చేస్తున్న వివిధ రకాల కార్యక్రమాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా సామాజికంగా ఆదివాసీలు బలపడాలని డీజీపీ శివధర్ రెడ్డి ఆకాంక్షించారు. హెల్మెట్లను తప్పనిసరిగా వాహనాలు నడిపేటప్పుడు పెట్టుకోవాలని సూచించారు.

PTC - ఆసిఫాబాద్

**రేషన్ బియ్యం సీజ్**

రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడలోని హరిహరి రైస్ మిల్లులో విజిలెన్స్ ఎన్ ఫోర్స్ మెంట్, పౌరసరఫరాల శాఖ అధికారులు దాడులు చేశారు. ఈ మిల్లులో 450 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గుర్తించారు. మొత్తం 450 క్వింటాళ్ల రేషన్ సన్న బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామని అధికారులు తెలిపారు.

PTC - సిరిసిల్ల

**ఎండ తీవ్రత**

రాష్ట్రంలో ఉష్ణోగ్రతలు రోజురోజుకు పెరుగుతున్నాయి. పలు జిల్లాల్లో 40,41 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. మరో నాలుగు రోజుల పాటు ఎండల తీవ్రత ఎక్కువగా ఉంటుందని వాతావరణ కేంద్రం హెచ్చరిస్తూ...ఆరెంజ్ అలర్ట్ ప్రకటించింది. మధ్యాహ్నం 12 గంటల నుంచి సాయంత్రం 4గంటల వరకు రోడ్డు మీద తిరగకపోవడమే మంచిదని అధికారులు సూచిస్తున్నారు.

డెస్క్

**ఆస్పత్రిలో కలెక్టర్ తనిఖీ**

గంజాయి, మద్యం వంటి మత్తు పదార్థాల బారిన పడిన వారికి మెరుగైన చికిత్స అందించి ఆరోగ్యవంతులుగా తీర్చిదిద్దాలని నల్లగొండ జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ అన్నారు. నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిలోని మత్తు విముక్తి కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన కలెక్టర్ అక్కడ రోగులకు అందిస్తున్న చికిత్స విధానం, కౌన్సెలింగ్ ను పరిశీలించారు. మందుల పంపిణీని పరిశీలించి తగు సూచనలు చేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... మత్తు పదార్థాలకు అలవాటు పడిన వారు ఆ అలవాట్ల నుంచి బయటపడేందుకు జిల్లాలో త్వరలోనే ప్రత్యేక డీ-అడిక్షన్ సెంటర్‌ను కూడా ఏర్పాటు చేస్తామని అన్నారు.

PTC – నల్లగొండ

**ఆయిల్ పామ్ సాగు**

రైతులు ఆయిల్ పామ్, ఉద్యాన పంటలు సాగు చేస్తే లాభదాయకమని మహబూబాబాద్ జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ శాఖ అధికారి జినుగు మరియన్న అన్నారు. కేసముద్రం మండలం కల్వల గ్రామంలో ఆయిల్ పామ్ సాగుపై అవగాహన సదస్సుతో పాటు క్షేత్ర సందర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా మరియన్న రైతులను ఉద్దేశించి మాట్లాడుతూ..... ఆయిల్ పామ్, ఉద్యాన పంటలను ప్రోత్సహిస్తూ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను, కల్పిస్తున్న మార్కెటింగ్ సదుపాయాల గురించి వివరించారు. భూసార, నీటి పరీక్షలు చేయించుకోవాలని, ప్రకృతి సేద్యం అవలంభించాలని అన్నదాతలకు సూచించారు.

PTC – మహబూబాబాద్

**ధాన్యం కొనుగోలు కేంద్రం**

యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరులో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ఈరోజు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అధికారులు సమర్థవంతంగా పనిచేయాలని సూచించారు. పారదర్శకంగా ధాన్యం కొనుగోలు చేయాలని, కోనుగోలు కేంద్రాల్లో రైతులకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించాలని అధికారులను ఆదేశించారు.

PTC - యాదాద్రి భువనగిరి